మంజూరైనా ఇవ్వడం లేదు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందక లబ్ధిదారుడి అగచాట్లు

చెక్కు వివరాలున్న పత్రాన్ని చూపుతున్న వెంకటేశ్వర్లు

బయ్యారం, నవంబర్ 6 : సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైనప్పటికీ చేతికి అందకపోవడంతో లబ్ధిదారుడు అగచాట్లు పడుతున్నట్లు ఆవేదన చెందుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంధంపల్లికి చెందిన దబ్బ వెంకటేశ్వర్లు ఏడాది క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. ప్రైవేట్ దవాఖానలో వైద్యం పొందిన తర్వాత మధ్యవర్తి సాయి ద్వారా సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపాడు. పేద కుటుంబం కావటంతో తెచ్చిన అప్పు తీర్చుకునేందుకు చెక్కు కోసం నెలల తరబడి ఆశగా ఎదురుచూస్తున్నాడు. ఈ క్రమంలో చెక్కు వచ్చిందని తెలిసి వారం రోజుల క్రితం ఇల్లందులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యయానికి వెళ్లాడు. అక్కడ చెక్కు నెల రోజుల క్రితమే వచ్చిందని చెప్పారు. మధ్యవర్తిని చెక్కు విషయం అడగ్గా దాట వేస్తున్నాడని, చెక్కు తన వద్దే ఉంచుకొని ఇవ్వటంలేదని ఆరోపించాడు. ఇప్పటికైనా చెక్కు తనకు ఇప్పించాలని బాధితుడు కోరుతున్నాడు.

అర్చకుడికి ఇల్లు

గార్ల, డిసెంబర్ 6: నీతంపేటలో సీతారామచంద్రస్వామి ఆలయం అర్చకుడు యాదగిరిస్వామికి అదే గ్రామానికి చెందిన ఊరుగొండ శ్రీనివాసరావు సొంత ఖర్చులతో గృహాన్ని నిర్మిస్తున్నాడు. గృహ నిర్మాణానికి శుక్రవారం ఉదయం భూమి పూజ చేశారు. అర్చకుడు మాట్లాడుతూ తనకోసం ఇంటిని నిర్మిస్తున్న దాత శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

ధ్వంసమైన ఫ్లెక్సీ

నెల్లికుదురు, డిసెంబర్ 6: కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీలను అదే పార్టీకి చెందిన ఓ వర్గీయులు ధ్వంసం చేశారు. ఈమేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు గుగులోత్ బాలాజీ నాయక్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని రామన్నగూడెంకు చెందిన నాయకుడు కాసం రంజిత్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఇటీవల మండల కేంద్రంలో పలుచోట్ల ఆ పార్టీ వర్గీయులు పెద్ద సంఖ్యలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గురువారం రాత్రి సంబంధిత ఫ్లెక్సీలను కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో వర్గీయులు ధ్వంసం చేశారని డీసీసీ ఉపాధ్యక్షుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
jobs Apply Now!
★Urgently Required Junior lecturers for Biology and Physics and male warden for Shaheen Junior college at Mulugu X Road, Hanumakonda. Contact Ph: 8374999474.
NTW-326564
SKY ASSOCIATES- WANTED
★Area collection executives, Telecallers,Experience is not required Locations: warangal, Narsampet,wardhannapeta, thorrur,parkal , mulugu,Ghanpur,-Cont 9491465729
NTW-000
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఇంటిగ్రేటెడ్ స్కూల్ డోర్నకల్‌లోనే నిర్మించాలి

- నియోజకవర్గ కేంద్ర ప్రజల డిమాండ్
- కొద్ది రోజులుగా ప్లకార్డులతో ఆందోళనలు

డోర్నకల్‌లో శుక్రవారం ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అంబేద్కర్ సేవా సంఘం సభ్యులు

డోర్నకల్, డిసెంబర్ 6: రాష్ట్ర ప్రభుత్వం డోర్నకల్ నియోజకవర్గ కేంద్రంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కావడంతో డోర్నకల్ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు కనీసం 30 ఎకరాల ప్రభుత్వ భూమి అవసరం. కానీ ఇక్కడ ప్రభుత్వ భూమి లేదని సాకుతో పక్క మండలంలో నిర్మిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో డోర్నకల్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా ప్లకార్డులతో ర్యాలీలు, నిరసనలు, రాస్తారోకోలు, ధర్నాలు చేస్తున్నారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అభిలపక్ష నాయకులు, ఫొటో, వీడియోగ్రాఫర్లు, అంబేద్కర్ సేవా సంఘం నాయకులు నియోజకవర్గ కేంద్రంలోనే ఇంటిగ్రేట్ స్కూల్ నిర్మించాలని కోరారు. డోర్నకల్‌లో ప్రభుత్వం భూమి ఉందని, రెవెన్యూ అధికారులు దృష్టి పెడితే కబ్జా కోరల్లో ఉన్న భూమిని స్వాధీనం చేసుకోవచ్చని, అందులో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అంటున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ప్రత్యేక చొరవ చూపి డోర్నకల్‌లోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అంబేద్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిరసన

ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను డోర్నకల్‌లోనే నిర్మించాలని అంబేద్కర్ సేవా సంఘం సభ్యులు ప్లకార్డ్స్‌తో శుక్రవారం గాంధీ సెంటర్‌లో నిరసన తెలిపారు. నియోజక వర్గానికి మంజూరైన ఈ స్కూల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మించాలని నినాదాలు చేశారు. ఎమ్మెల్యే చొరవ చూపాలని కోరారు. వార్డు కౌన్సిలర్ అశోక్, అంబేద్కర్ సేవ సంఘం సభ్యులు గాజుల వేణు, ఏపూరి కృష్ణ, విలియం, శ్రీనివాస్, ప్రవీన్, మధు పాల్గొన్నారు.

ఎస్పీను మర్యాద పూర్వకంగా కలిసిన హోంగార్డులు

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 6: విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. శిక్షణలో భాగంగా శుక్రవారం జిల్లాకు వచ్చిన ప్రొబేషనరీ ఎస్సైలు ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలని సూచించారు. నిజాయితీగా విధులు నిర్వర్తిస్తూ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రొబేషనరీ ఎస్సైలు రవికుమార్, ఖాదర్‌పాషా, నరేష్, శివరామకృష్ణ, మైబూబి, అంజమ్మ, మౌనిక పాల్గొన్నారు.

పోలీసులతో సమానంగా హోంగార్డుల విధులు

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా హోంగార్డ్‌లు విధులు నిర్వహిస్తారని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్‌లో హోంగార్డ్‌ల రైసింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ డిసెంబర్ 6న హోంగార్డ్‌ల రైసింగ్ డేగాను నిర్వహిస్తారని తెలిపారు. హోంగార్డ్‌లు సమయనుసారంగా విధులకు హాజరు కావాలన్నారు. ఏఆర్ డీఎస్పీ విజయ్ ప్రతాప్, ఆర్ఐ భాస్కర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


చెత్తసేకరణ ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

పలు అభివృద్ధి పనుల ప్రారంభం

తొర్రూరు, డిసెంబర్ 6: పట్టణంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మున్సిపాలిటీలో 15వ వార్షిక నిధులు రూ.23.50లక్షలతో కొనుగోలు చేసిన చెత్తసేకరణ ట్రాక్టర్లు, రూ.14.50లక్షల నిధులతో కొనుగోలు చేసిన డోజర్లు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకుర్తిని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు రేవతి గజానంద్, రోజా మాధవి, నిరంజన్‌రెడ్డి, రాజశేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కౌన్సిలర్లకు అవమానం


కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

తొర్రూరు, డిసెంబర్ 6: తొర్రూరు మున్సిపాలిటీలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి చేతులమీదుగా చెత్తసేకరణ ట్రాక్టర్లు, డోజర్ల ప్రారంభోత్సవానికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులను మున్సిపల్ కమిషనర్, చైర్మన్ ఆహ్వానించకుండా అవమానం పరిచారని మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు శుక్రవారం బీఆర్ఎస్ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొర్రూరు మున్సిపాలిటీ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా మారుస్తున్నారని, మున్సిపల్ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన అంబేద్కర్ 68వ వర్ధంతి కార్యక్రమంపై బీఆర్ఎస్ కౌన్సిలర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, మున్సిపాలిటీ ఎజెండా మీటింగ్‌ను బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు బహిష్కరించినట్లు తెలిపారు. దీంతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెళ్లిపోయారని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్, చైర్మన్ సొంత నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. మున్సిపల్ వార్డు సభ్యులు పేర్ల యమున జంపన్న, ధరావత్ సునీత జై సింగ్, కర్నె నాగజ్యోతి నాగరాజు, గుగులోత్ శంకర్, చకిలేల అలివేణి, తూర్పాటి సంగీత రవి, కో ఆప్షన్ సభ్యులు కుర్ర కవిత శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధ్యాపకుల డుమ్మాపై డీఐఈఓ విచారణ

విచారణ చేస్తున్న డీఐఈవో మదార్‌ఖాన్

తొర్రూరు, డిసెంబర్ 6: కళాశాలలో బయోమెట్రిక్ అటెండెన్స్ వేసుకొని విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించకుండా అధ్యాపకులు ప్రిన్సిపాల్ కొడుకు పెళ్లికి వెళ్లారు. తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ ఘటనపై శుక్రవారం డీఐఈఓ మదర్‌ఖాన్ విచారణ చేపట్టారు. కళాశాలలోని కొంతమంది అధ్యాపకులు బయోమెట్రిక్ వేసుకొని, ప్రిన్సిపాల్ కుమారుడి వివాహ వేడుకలకు హాజరయ్యారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘం నాయకులు ఆగ్రహిస్తున్నారు. కాగా, విచారణకు వచ్చిన డీఐఈఓ కొందరు సెలవు పత్రాలను అందించారని ఒకసారి, సెలవు పత్రాలు ఇవ్వలేదని మరోసారి చెప్పడంపై అనుమానాలు చోటు చేసుకుంటున్నాయి. పూర్తి విచారణ చేపట్టి అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ప్రవీణ్‌రావు

నెల్లికుదురు, డిసెంబర్ 6: వెలమ కులస్తులపై అనుచిత వాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై మండలంలోని మునిగలవీడు గ్రామానికి చెందిన వెలమ కుల సంఘం మండల నాయకుడు నల్లాని ప్రవీణ్‌రావు శుక్రవారం నెల్లికుదురు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ వెలమ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే శంకర్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉపేందర్ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

ఉపాధ్యాయుడి కుటుంబానికి టీపీటీఎస్ ఆర్థికసాయం

బయ్యారం, నవంబర్ 6: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఉపాధ్యాయుడు సంద్ర ఉపేందర్‌రావు కుటుంబానికి తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎస్) ఆధ్వర్యంలో రూ.లక్షా 50వేల ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం కొత్తపేటలోని మృతుడి స్వగృహంలో సంతాప సభ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు బలాస్టి రమేశ్, ప్రధాన కార్యదర్శి పీ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడారు. ఉద్యోగం పొందిన మొదటి నెల జీతం తీసుకోకుండానే ఉపేందర్‌రావు మృతిచెందటం బాధాకరమన్నారు. జిల్లా నాయకులు చుంచు శ్రీశైలం, మల్లెల సాంబయ్య, మండల ప్రధాన కార్యదర్శి భావ్‌సింగ్ ఉన్నారు.

పదో తరగతి విద్యార్థుల స్నాక్స్ కోసం రూ.10వేలు అందజేత

దంతాలపల్లి, డిసెంబర్ 6 : మండలంలోని పెద్దముప్పారం జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ కోసం రూ.10వేలు అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి ఎన్ఆర్ఐ ఇంజమూరి రేణుక ఏటా మాదిరిగానే ఈసారీ అందించారు. పదో తరగతి ఫలితాల్లోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు కూడా అందిస్తారని ఇన్‌చార్జి హెచ్ఎం కొంపెల్లి శంకరయ్య తెలిపారు.

అధునాతన పద్ధతులతోనే రైతులకు మేలు

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 6 : అధునాతన వ్యవసాయ పద్ధతులతోనే రైతులకు మేలు జరుగుతుందని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ ముఖేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు సాయిల్ హెల్త్ టెస్టింగ్ కార్డ్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సాయిల్ హెల్త్ కార్డ్ ద్వారా భూమి సారవంతం, కావాల్సిన పోషకాలు, తగిన ఎరువులు, ఇతర సమాచారాన్ని పొందవచ్చని తెలియజేశారు. 50 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాలలో ఈ కార్డులను పంపిణీ చేశారు. రితేశ్‌కుమార్, సతీష్, దాసు దుర్గాప్రసాద్, యాసిన్, ఇమాముద్దీన్ పాల్గొన్నారు.

సాయిల్ హెల్త్ టెస్టింగ్ కార్డ్‌లను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ముఖేశ్‌కుమార్

ఉపాధి డబ్బులు డ్రా చేసుకున్న వ్యక్తికి జైలు

మరిపెడ, డిసెంబర్ 6: ఉపాధి హామీ డబ్బులను డ్రా చేసుకొని తన అవసరాలకు వినియోగించుకుని లబ్ధిదారులను చీటింగ్ చేసిన కేసులో ఒకరికి తొర్రూరు కోర్టు సివిల్ జడ్జి మట్ట సరిత ఏడాది జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. మరిపెడ ఎస్సై బీ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎడ్జెర్ల శివారు పూసలతండాకు చెందిన బాధావత్ వెంకన్న 2015లో ఎడ్జెర్ల బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఉపాధి హామీ పథకం లబ్ధిదారులకు చెందిన రూ.27,000ను వారికి తెలియకుండా డ్రా చేసుకొని సొంతానికి వాడుకున్నాడు. నాటి అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీధరం తనిఖీల్లో ఈ విషయం తేలగా స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాటి ఎస్సై ఆర్.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని కేసు విచారణ చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా కోర్టు పూర్వాపరాలను పరిశీలించి నిందితుడికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రైవేట్ టీచర్లకు భద్రత కల్పించాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 6: ప్రైవేట్ టీచర్లకు ప్రభుత్వం భద్రత కల్పించాలని జిల్లా ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు గండు మురళీ అన్నారు. శుక్రవారం పట్టణంలో రాయచోటిలో ఉపాధ్యాయుడిపై దాడి ఘటనపై రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. బోయినపల్లి సుధాకర్, అశోక్, రాంబాబు, అర్జున్, శంకర్, ఉప్పలయ్య, యాసిన్, నరేష్, సంతోష్ పాల్గొన్నారు.

జల బిందెలతో ఆలయానికి తరలి వెళ్తున్న గౌడ కుటుంబాలు

కంఠ మహేశ్వరుడికి జలాభిషేకం

చిన్నగూడూరు, డిసెంబర్ 6: గౌడ కులస్తులు తమ ఆరాధ్య దైవం కంఠమహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మంగళ హారతులు, పురుషులు జలబిందెలతో ఇంటింటా ఆలయానికి వెళ్లి జలాభిషేకం చేశారు. పసుపు, కుంకుమలతో పూజలు చేశారు.

తాటిచెట్టుపై గీత కార్మికుడి మృతి

తొర్రూరు, డిసెంబర్ 6: తాడిచెట్టుపై గీత కార్మికుడు మృతిచెందిన ఘటన మండలంలోని నాంచారిమడూరులో శుక్రవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కేశగాని వీరయ్య(52) వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కాడు. కల్లు గీస్తుండగా తాటిచెట్టుపైనే నిలబడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డోర్నకల్: జడ్పీహెచ్ఎస్ ఆవరణలో అంబేద్కర్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయుల నివాళులు

బయ్యారం: అంబేద్కర్ విగ్రహానికి నివాళ్ళు అర్పిస్తున్న నాయకులు

అంబేద్కర్‌కు ఘన నివాళి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి శుక్రవారం జిల్లా వ్యాప్తంగా జరిగింది. అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, ప్రజా, కుల సంఘాల నాయకులు, పలు రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, యూత్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ సేవలను పలువురు కొనియాడారు. అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు.

– నమస్తే, నెట్‌వర్క్

కొత్తగూడ : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు

తొర్రూరు: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


మహబూబాబాద్ రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకుడు కిషన్‌నాయక్

గార్ల: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

నెల్లికుదురు: అంబేద్కర్ యువజన సంఘ నాయకుల నివాళి

నర్సింహులపేట: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

కేసముద్రం: నివాళులు అర్పిస్తున్న నాయకులు

దంతాలపల్లి: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాల మహానాడు నాయకులు

మరిపెడ: నివాళులర్పిస్తున్న యూత్ కమిటీ సభ్యులు


గూడూరు: అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఇనుగుర్తి: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కురవి: అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం, దళిత సంఘాల ప్రతినిధులు